RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 307 పేజీలు - 08 గురువారం 01 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి

రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలు



**తొలి అక్షరం/హైదారాబాద్,సెప్టెంబర్ 30:** వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి

మిగతా2లో...

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

జెండా ఎగురవేసిన మొనగాడికి మంత్రి పదవి

భవిష్యత్తులో మంత్రివర్గంలోకి తీసుకుంటా..

గత ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు

సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా..

తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లతో రాజకీయ లబ్ది

కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకున్నారు

సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సిఎం రేవంత్

కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విమర్శలు

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తా..

కరీంనగర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభం

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరణ

అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ శ్రీకారం



2లో





2లో

## పంటలకు కనీస మద్దతు ధర పెంపు

2,610కు చేరిన క్వింటా గోధుమలు

రబీపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

ఢిల్లీలో ట్రాఫిక్ పరిష్కారానికి చర్యలు

ఏఐ సాయం తీసుకుంటామని వెల్లడి

# ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

● ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై చర్చ! ● ప్రపంచ శాంతి భద్రతలపైనా సమాలోచనలు



2లో

# అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

'నో యూపీఐ డే' నిరసనను విరమణ

నిర్మలా సీతారామన్‌తో వ్యాపారవేత్తల భేటీ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30:** యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ ఛార్జీకి వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టాలనుకున్న 'నో యూపీఐ డే' నిరసనను వ్యాపార సంఘాలు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు

మిగతా2లో...

## అదనపు డిక్లరేషన్ తొలగింపు

- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఫారం-6లో కీలక మార్పు చేసిన ఈసీ
- సర్ పూర్తయిన రాష్ట్రాలకు వర్తింపు




2లో

# అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

● ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం.. ● దేశవ్యాప్త ఆందోళనలకు కూటమి పిలుపు ● అక్టోబర్ 6న విపక్ష ఎంపీల ప్రదర్శన.. ● కూటమి ఉద్యమ కార్యాచరణ ఖరారు




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 :** ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు.

మిగతా2లో...

# మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు

● వచ్చే ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని నేను కాదు ● కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు ● కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ● బీఆర్ఎస్-బీజేపీ మధ్య పొత్తు ఉండబోదు ● రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు




**తొలి అక్షరం/హైదారాబాద్,సెప్టెంబర్ 30 :** వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం

మిగతా2లో...

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం

వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలి



2లో

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

**తొలి అక్షరం/సిరిసిల్ల,సెప్టెంబర్ 30:** గజ్వేల్ గడీ కూల్చినట్లే ఈసారి సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దామని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా హోటళ్లలో ప్లేట్లు కడిగిన వ్యక్తికి తన విలువ ఎలా తెలుస్తుందని ఘాటుగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోయిన వారికి తన గురించి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్ల పాలనలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా టీవీ ఛానళ్లు, పత్రికలు, ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్లు మాత్రమే సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టెండర్లు వేసి కేవలం కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. చివరకు ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు కొట్టి తిన్నారని తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 'పుట్టింటి సారె' ద్వారా నాణ్యమైన చీరలను అందిస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌గా ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముందు దళితులు డప్పు కొడితే ఆ స్థలాన్ని పసుపు నీళ్లతో కడిగించారని, ఇది తీవ్రమైన అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బహిష్కరించే వరకు సమాజం వదలదని హెచ్చరించారు. ఎర్రవెల్లి భూ ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావ్ అక్రమ ఆస్తుల లెక్కలు తేలుస్తామని, డెక్కన్ స్టార్ హోటల్స్ తదితర ఆస్తుల వివరాలను అసెంబ్లీలో సమయం చాలక దాచామని, త్వరలోనే పార్ట్-2 పేరుతో ప్రజల ముందు పెడతామని సీఎం స్పష్టం చేశారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే నాయకుడిని కేబినెట్ బెర్త్ కన్ఫార్మ్ అంటూ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం అంటూ కార్యకర్తల్లో జోష్ నింపేలా వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీ విషయంలో తాము చెప్పినది చేసి చూపించామని.. ఇప్పుడు సిరిసిల్లపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడికి మంత్రి పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కుటుంబ సభ్యులకు కీలక పదవులు దక్కాయని.. కాంగ్రెస్‌లో మాత్రం పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలు, నాయకులకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30:** భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అత్యంత ప్రాధాన్యత కలిగిన ఫోన్ సంభాషణ జరిగింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల అగ్రనేతలు ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా సమీక్షించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య పరస్పర వాణిజ్యం, రక్షణ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వనరులు, కీలక అధునాతన సాంకేతిక రంగాలలో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇద్దరు నేతలు దృష్టి సారించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు నడిపించేందుకు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ వాణిజ్య చర్చలు, ప్రాంతీయ భద్రతా వ్యవహారాలు కొనసాగుతున్న తరుణంలో ఈ ఫోన్ కాల్ చర్చ జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తించింది. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన భద్రతా ఒప్పందాల అమలుపై నేతలిద్దరూ సమాలోచనలు జరిపినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. సైనిక రంగంలో పరస్పర భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ఇరు దేశాల రక్షణ పరిశ్రమల అనుసంధానాన్ని వేగవంతం చేయడంపై చర్చించారు. రక్షణ రంగంతో పాటు అత్యాధునిక సాంకేతికతల బదిలీ, కృత్రిమ మేధ, పరిశోధనలలో సంయుక్తంగా అడుగులు వేయడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇంధన రంగంలో దేశ భద్రతను పటిష్ఠం చేసుకుంటూనే వాణిజ్య విస్తరణకు ఉన్న అవకాశాలను ఇరు దేశాలు సమీక్షించాయి. ప్రపంచ చమురు మార్కెట్ ఒడిదుడుకులు, సహజ వనరుల సరఫరాలో స్థిరత్వాన్ని సాధించేందుకు పరస్పర సహకారం కొనసాగించాలని ఇరు పక్షాలు నిర్ణయించుకున్నాయి. ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా వాణిజ్య సుంకాలు, మార్కెట్ భాగస్వామ్యంపై ఉన్న సవాళ్లను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భావించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రిహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్) నూతన శిఖరాలకు చేర్చేందుకు నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. ప్రపంచ శాంతి, ప్రాంతీయ సుస్థిరత కోసం ఇరు దేశాల బలమైన మైత్రి ఎంతో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, పారిశ్రామిక స్థాయిలలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# పంటలకు కనీస మద్దతు ధర పెంపు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30:** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రబీ పంటలకు సంబంధించి 2027-28 సీజన్‌కు మద్దతు ధరను నిర్ణయించింది. గోధుమలు, బార్లీ (జౌ), శనగలు, ఆవాలు, పొద్దుతిరుగుడు (కుసుమ), మసూర్ (కందులు/చిరుధాన్యాల రకం) పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమలపై క్వింటాలుకు రూ.25 పెంచారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాలుకు 675 చొప్పున పెంపుదల చేశారు. ఆ తర్వాత రేప్‌సీడ్, ఆవాలకు క్వింటాలుకు 413 చొప్పున పెంచారు. మసూర్ పంటకు క్వింటాలుకు 390, బార్లీకి (జౌ) క్వింటాలుకు 136, శనగలకు క్వింటాలుకు 83, గోధుమలకు క్వింటాలుకు 25 చొప్పున పెంచారు.

ఢిల్లీ ట్రాఫిక్ నిర్వహణను మెరుగు చేయడం కోసం 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకురావాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 1,529 ట్రాఫిక్ సిగ్నల్స్ స్థిరమైన మ్యాన్యువల్ పద్ధతిలో ఉన్నాయి. అయితే 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వచ్చిన తర్వాత ఈ సిగ్నల్స్ ట్రాఫిక్ రద్దీకి తగ్గట్లుగా సిగ్నల్ సమయాన్ని అవే అడ్జస్ట్ చేసుకుంటాయి. దీనిని మూడు విడతలలో (ఫేజ్‌లలో) అమలు చేయనున్నామని తెలిపారు. వేర్వేరు కారిడార్లలో వేర్వేరు సమయాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తారు. ఇందుకోసం కేంద్రం 1,790 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌తో కలిపి రెన్యూవబుల్ ఎనర్జీ సరఫరా చేయడం కోసం 1.86 లక్షల కోట్ల అంచనాతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ 111' పథకానికి కూడా మోదీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'పీఎం ధార' పథకాన్ని తీసుకొచ్చింది. రూ. 1,86,405 కోట్లను ఈ పథకానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక, నూనె గింజల విషయానికొస్తే ఆవాల మద్దతు ధర క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 413 పెరిగి రూ. 6,613కి చేరిందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# అదనపు డిక్లరేషన్ తొలగింపు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదం కొనసాగుతున్న వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే వారికి సంబంధించిన ఫారం-6లో కీలక మార్పు చేసింది. సర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫారం-6తో పాటు జత చేసిన అదనపు సర్ డిక్లరేషన్‌ను తొలగించింది. అదనపు నిబంధన కేవలం సవరణ ప్రక్రియ జరిగే సమయంలో మాత్రమే వర్తిస్తుందని, సర్ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో మాత్రం వర్తించదని తెలిపింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన పూర్తిస్థాయి కమిషన్ ఈనెల 26న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈసీ నిర్ణయం ప్రకారం, సర్ ప్రక్రియ పూర్తయిన ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇకపై ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారం-6ను మాత్రమే పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం అదనపు డిక్లరేషన్ అందుబాటులో ఉంది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే దరఖాస్తుదారులు తాము లేదా తమ తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు గతంలో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాల్లో ఉన్నారనే వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ అదనపు ప్రకటనను సర్ ప్రక్రియలో భాగంగానే ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. అయితే సవరణ పూర్తయిన ప్రాంతాల్లో దాని అవసరం ఉండదని స్పష్టం చేస్తూ తాజాగా ఆప్షన్‌ను తొలగించింది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్‌ను ఈసీఐనెట్ యాప్, పోర్టల్ నుంచి తొలగించారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వెబ్‌సైట్లలోనూ ఇదే మార్పు చేశారు. ఇక ఆయా రాష్ట్రాల్లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే పౌరులు రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారం-6లో అవసరమైన వివరాలను మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఫారం- 6కు జత చేసిన అదనపు డిక్లరేషన్ కేవలం సర్ ప్రక్రియ కోసమేనని అందులో ఈసీ పేర్కొంది.

సర్ అమలు లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం వర్తించే సాధారణ ఫారమ్‌లనే ఉపయోగిస్తామని స్పష్టం చేసింది. దీంతో సర్ పూర్తయిన ప్రాంతాల్లో సాధారణ ఫారం-6 ప్రక్రియకు తిరిగి వెళ్లేలా ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన చట్టబద్ధ ప్రక్రియలో అదనపు సర్ వివరాలను అడగడం ఇకపై ఉండదు. ఫారం-6కు సంబంధించిన మార్పులపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావటం ఇటీవల వివాదాస్పదంగా మారింది. ఫారం-6లో చేసిన మార్పుల అంశం గతంలో ఎన్నికల సంఘంలోనే చర్చనీయాంశమైంది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు అర్హులైన భారతీయ పౌరులు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారమ్‌గానే ఫారం-6ను రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 నిర్దేశిస్తుంది. ఈ ఫారమ్‌లో మార్పులు చేయడంపై ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి,సుఖ్‌బీర్ సింగ్ సంధు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిబంధనల ద్వారా నిర్దేశించిన ఫారమ్‌ను సంబంధిత నిబంధనలను సవరించకుండా మార్చలేదని, అలాగే ఈసీఐనెట్‌లో ఫారం-6 దరఖాస్తు ప్రక్రియకు సర్‌కు సంబంధించిన అదనపు డిక్లరేషన్‌ను జత చేయడంపైనా సంధు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 30 :** వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకుల నుంచి క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. **పనుల ఎంపికలో గ్రామసభలదే కీలక పాత్ర** అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీతక్క ఆదేశించారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీల పాత్ర, బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. **పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట** ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనాన్ని పాటించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి అందేలా వీబీ జీ రామ్ జీ అమలును మరింత పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

(మొదటి పేజీ తరువాయి)

20 మంది వ్యాపార ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు విధించే ప్రతిపాదనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఛార్జీతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారం పెరుగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. చాందినీ చౌక్ ఎంపీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిపాదిత ఛార్జీపై స్పష్టత ఇవ్వాలని కోరింది. వ్యాపారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమావేశం తర్వాత ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. కేంద్రంతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. వ్యాపారులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న భరోసా లభించిందన్నారు.

దీంతో అక్టోబర్ 2న తలపెట్టిన నిరసనను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ తొలుత 'నో యూపీఐ డే'కు పిలుపునిచ్చాయి. అయితే కేంద్రంతో చర్చల తర్వాత ఆ పిలుపును వెనక్కి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా.. రూ.2,000కు మించిన అర్హత ఉన్న మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. మరోవైపు యూపీఐపై జీఎస్టీ భారం పెరుగుతుందన్న వార్తలను ఎన్‌పీసీఐ గతంలో ఖండించింది. రూ.2,000 వరకు జరిగే లావాదేవీలకు జీరో ఎండీఆర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం యూపీఐ వ్యాపార లావాదేవీల్లో 96 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నాయి.

## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్ కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవసథలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తామని మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ.. ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ అనే 3 పదాలను కేటీఆర్ ఉపయోగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని.. పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని.. భవిష్యత్తులో తిరుగుబాటు వస్తుందని ఆయన తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని.. తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ 26 ఏళ్ల చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పటికీ పార్టీ సిద్ధాంతంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. పార్టీ డీఎన్ఏ మారలేదని.. అందువల్ల సిద్ధాంతం కూడా మారలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేసిన కేటీఆర్.. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే సమయంలో గత పరాజయం కంటే పెద్ద స్థాయిలో పునరాగమనం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభ స్థానాలను పెంచడంపై మాత్రమే ఎందుకు దృష్టి పెట్టాలని ప్రశ్నించిన ఆయన.. ప్రజలకు ఎమ్మెల్యేలే తొలి స్థాయి ప్రజాప్రతినిధులుగా ఉంటారని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరగకూడదన్న ఆందోళనను కేటీఆర్ వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడంతో పాటు, ప్రాతినిధ్యం విషయంలో అనుపాత విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని కేటీఆర్ చెప్పారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు ఊదరి రాధే శ్యామ్ ఎంపిక

**● మల్కంబ్‌లో ప్రతిభ చాటిన తంగడపల్లి విద్యార్థి**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 మల్కంబ్ ఎంపిక పోటీల్లో తంగడపల్లి గ్రామానికి చెందిన ఊదరి రాధే శ్యామ్ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన అండర్-17 బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారుల ప్రతిభ, నైపుణ్యం, ప్రదర్శన ఆధారంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఊదరి శ్యామ్ సుందర్, లావణ్య దంపతుల కుమారుడైన రాధే శ్యామ్ ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికై, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి మల్కంబ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ మల్కంబ్ క్రీడ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, సమతుల్యత, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.



చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీఏ రాష్ట్ర



అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య, ఉపాధ్యాయులు, పీఈటీలు, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్ తదితరులు పాల్గొని రాధే శ్యామ్‌ను అభినందించారు.

# 22ఏ నిషేధిత జాబితాతో రైతులకు కొత్త సమస్యలు

**● భూ సమస్యలు పరిష్కరించకపోగా మరిన్ని ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఉప్పు కృష్ణ ఆరోపణ**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించకుండా 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో ప్రభుత్వం రైతులకు కొత్త సమస్యలు సృష్టిస్తోందని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ ఆరోపించారు. అసైన్డ్, సీలింగ్ భూములను ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులు భూముల కొనుగోలు, విక్రయాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లల ఉన్నత చదువులు, ఆడపిల్లల వివాహాల కోసం భూములు విక్రయించుకోవాలన్నా సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. భూభారతి ఆర్ఓఆర్ చట్టం అమల్లోకి వచ్చినా రెవెన్యూ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులకు చాలామందికి ఇప్పటికీ సమాధానాలు రాలేదన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్ల రైతులు కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను రద్దు చేసి, అసైన్డ్, సీలింగ్ భూముల విషయంలో భూపరిమితి చట్టం ప్రకారం రైతులకు వెసులుబాటు కల్పించాలని ఉప్పు కృష్ణ డిమాండ్ చేశారు. పంట నమోదు, ఆన్‌లైన్ భూమి సమస్యలు, పంట కొనుగోలు ఓటీపీలు, యూరియా బుకింగ్ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అప్పుల బాధతో అమ్మమ్మను హత్య చేసి బంగారం, వెండి అపహరణ!

**- తూప్రాంపేట్ వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన చౌటుప్పల్ పోలీసులు.. నిందితుడు అరెస్ట్**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాంపేట్‌లో వృద్ధురాలు మంటిపల్లి యాదమ్మ (70) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అప్పులు, ఈఎంఐలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మంటిపల్లి రాజు (31) డబ్బుల కోసం తన వరుసకు అమ్మమ్మ అయిన యాదమ్మను హత్య చేసి, ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 27న మంటిపల్లి దర్శన్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం ప్రాథమిక వివరాలు, మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా హత్యగా అనుమానించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో రాజుపై అనుమానం రావడంతో ఈ నెల 30న అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

**బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**

రాజు వద్ద నుంచి సుమారు 4.5 తులాల బంగారు ఆభరణాలు, చెవి దుద్దులు, మాటీలు, భారీగా





వెండి ఆభరణాలతో పాటు వీవో వై20జీ స్మార్ట్‌ఫోన్, ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెండి ఆభరణాల్లో






సుమారు 90 తులాల కాలి కడియాలు, 40 తులాల సలాం కడియాలు, 29 తులాల కాలి గొలుసులు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుడు రాజును అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ పి. మధుసూదన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్, ఎస్ఐలు పి. రవీందర్, సతీష్, సిబ్బంది దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు.

# మల్కాపురం గుట్ట ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం

**● 50- 60 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసుల ప్రాథమిక అంచనా.. వివరాల కోసం దర్యాప్తు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపురం ఆర్‌టీవో కార్యాలయం పక్కన ఉన్న గుట్ట ప్రాంతంలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో మృతుడి వివరాలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. గుట్ట ప్రాంతంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, మృతుడి గుర్తింపు, ఆచూకీ, మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరిస్తున్నారు. మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు చౌటుప్పల్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ కోరారు.

# గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులు

**- గ్రామ దేవాలయ అర్చకులకు శిక్షణ..**




**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 30:** గ్రామ దేవాలయాల్లో అర్చకుల కొరతను అధిగమించడంతో పాటు దేవాలయాల్లో నిత్య పూజలు, అర్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించేలా అర్చకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ధర్మజాగరణ విభాగం నిర్వాహకులు తెలిపారు. గ్రామ దేవాలయాల్లో అర్చకులు లేని కారణంగా పూజా కార్యక్రమాలు సక్రమంగా జరగని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శిక్షణ తరగతులను నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గల సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ డాక్టర్ నాన్న ఆశ్రమం నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు 5వ తరగతి లేదా అంతకంటే పై చదువు చదివి ఉండాలి. పూజా విధానంలో మంత్రాలు చదవగలగాలి. వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. శిక్షణలో భాగంగా యోగా కూడా ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలం మొత్తం ఏడు రోజులు ఉండగా, మధ్యలో వెళ్లేందుకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సంబంధిత ధ్రువపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

**అర్చకులకు ప్రత్యేక శిక్షణ**

ఏడు రోజుల శిక్షణలో నిత్య పూజా విధానాలు, గ్రామ దేవాలయాల్లో నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాలు, పూజా సామగ్రి వినియోగం, నైవేద్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. దేవాలయాల్లో అర్చకులుగా సేవలందించేందుకు అవసరమైన ప్రాథమిక అంశాలను వివరించనున్నారు.

# చేనేత సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకొస్తాం

**- కార్మికులకు చేతినిండా పని కల్పించడమే లక్ష్యం: చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** చౌటుప్పల్ పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకారవస్త్ర ఉత్పత్తి విక్రయ సంఘం 51వ వార్షిక, 65వ సర్వసభ్య సమావేశం బుధవారం పద్మ వంశీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో సంఘం మేనేజర్ రాపోలు శ్రీరాములు అంచనా ఆదాయాలు, జమా ఖర్చుల వివరాలను సర్వసభ్య సమావేశం ముందు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు వాటిని ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు నిరంతరం చేతినిండా పని కల్పించి, చౌటుప్పల్ చేనేత సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని పేర్కొన్నారు. చేనేత రంగం అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మాజీ వ్యవసాయ మార్కెట్





గోశిక చక్రపాణి, గుర్రం రవీందర్, కందగట్ల బిక్షపతి, శ్రీ శివ భక్త మార్కండేయ దేవస్థానం అధ్యక్షుడు బడుగు ప్రకాష్, మాజీ ఎంపీటీసీ పెద్దికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంఘం ఉపాధ్యక్షుడు గోశిక శ్రీకాంత్, కార్యదర్శి కాటాబత్తిని భీమయ్య, కోశాధికారి బడుగు సావిత్రి, డైరెక్టర్లు బత్తుల మానస, పాపని రామకృష్ణ, గోశిక లక్ష్మీపతి, గోశిక నరసింహ, దోర్నాల లక్ష్మీనారాయణ, సంఘం సేల్స్‌మెన్

చైర్మన్లు బడుగు మాణిక్యం, బడుగు లక్ష్మయ్య, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గుర్రం నరసింహ, చౌటుప్పల్ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు గోశిక ప్రభాకర్, నార్కట్‌పల్లి సేల్స్‌మెన్ పాపని వాసుదేవ్, సంఘం ఇన్‌చార్జి గోశిక ధనంజయ, అటెండర్ ఎరుకల రాములు, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# తాను నాయక్ నగారా ఉత్సవాలను జయప్రదం చేయండి

**- గిరిజన సంఘం నేతలు, ప్రజాప్రతినిధుల పిలుపు**




**తొలి అక్షరం/ఏన్కూర్, సెప్టెంబర్ 30:** అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే తాను నాయక్ నగారా ఉత్సవాలను గిరిజనులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం, ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఏన్కూర్‌లో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని అన్నారు. తాను నాయక్ స్ఫూర్తితో గిరిజన హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# విద్యా సేవా రత్న' అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు మహమ్మదీ బేగం




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 30:** జిల్లా స్థాయిలో 'విద్యా సేవా రత్న' అవార్డుకు మదర్ థెరిసా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, రామన్నపేట ఉపాధ్యాయురాలు మహమ్మదీ బేగం ఎంపికయ్యారు.ట్రస్మా రాష్ట్ర జిల్లా నాయకుల చేతుల మీదుగా ఆమె మెమెంటో అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మార్టిన్ ఉపాధ్యాయురాలికి అభినందనలు తెలిపారు.

# పట్టణాన్ని శుభ్రంగా ఉంచే చేతులకు ఆరోగ్య రక్షణ

**- స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు.. పారిశుధ్య సిబ్బందికి భద్రతా కిట్లు, ఘన సన్మానం**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 30:** చౌటుప్పల్ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం వంటి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, స్వచ్ఛ ఆటో సారథులు, వ్యర్థాల సేకరణ కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులకు రక్షణ కిట్లు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు, వ్యర్థాల సేకరణ కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విధి నిర్వహణలో వారి ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్మికులు విధి నిర్వహణలో తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ కిట్లు ధరించి సురక్షితంగా పనిచేయాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలు, బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, కౌన్సిలర్ హను మహమ్మద్, నాయకులు బత్తుల దాసు, దేప రాజు, వైద్యులు డాక్టర్ జయంత్ కుమార్, డాక్టర్ సౌజన్య, ముఖ్య ఆరోగ్య అధికారి కృష్ణ కుమార్, ఆరోగ్య విద్యాధికారి సాయి రెడ్డి, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ అధికారి అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాల పంట

**- ఆర్ ఐ నోముల నర్సయ్యకు అభినందనల వెల్లువ**






**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 30:** తెలంగాణ పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28,29,30 తేదీలలో జరిగిన ఐదవ తెలంగాణ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో 8వ బెటాలియన్ ఆర్ ఐ నోముల నర్సయ్య అద్భుత ప్రతిభ కనబరిచారు.టెన్నిస్ గేమ్ లో 50 సంవత్సరాల విభాగంలో డబుల్స్ లో గోల్డ్ మెడల్ సింగిల్స్ లో సిల్వర్ మెడల్ మరియు 40 సంవత్సరాల విభాగంలో డబుల్స్ లో సిల్వర్ మెడల్ సాధించి బెటాలియన్ కీర్తిని ఇనుమడింపజేశారు. 8వ బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి నర్సయ్య ని హృదయపూర్వకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, భవిష్యత్తులో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.మూడు పతకాలు సాధించిన నర్సయ్య స్వగ్రామం యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన వారు కావడం విశేషం

# నెక్కొండలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటుకు వినతి

**- నెక్కొండ మండల ప్రజల న్యాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతి**



**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 30:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రం, పరిసర గ్రామాల ప్రజలు వివిధ సివిల్, ఆస్తి, కుటుంబ సంబంధిత న్యాయ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.నెక్కొండలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు త్వరగా, సులభంగా, తక్కువ ఖర్చుతో న్యాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలు, రైతులు, మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కోర్టు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతాధికారులు, న్యాయశాఖ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టాలని కోరారు.ఈ వినతి పత్రాన్ని నెక్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, న్యాయవాది లావుడ్య తిరుమల్ చౌహాన్ అందజేశారు.




# పంట అమ్మకంలో రైతుకు ఎలాంటి భారం పడకూడదు

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** 2026-2027 సంవత్సరంలో రైతులు పండించిన పత్తి పంటను మార్కెట్లలో అమ్ముకునే సమయంలో రైతులపై ఎలాంటి ఖర్చులు పడకుండా మార్కెట్ కమిటీ చూడాలనే విధంగా రైతు సంఘాలు జిల్లా కలెక్టర్ ను కోరారు.వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 2026-27 సంవత్సరంలో(సీసీఐ)కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసే విషయంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు.తెలంగాణ రైతు సంఘం,అఖిల భారత కిసాన్ సంఘటన్ ఆధ్వర్యంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్నటు వంటి సమస్యలు గురించి అదే విధంగా కౌలు రైతులను గుర్తించి వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చే విధంగా చూడాలని లేకపోతే కౌలురైతు పత్తి పంట అమ్ముకునే పరిస్థితి లేక దళారులకే ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడి రైతులు వేల రూపాయలు నష్టపోతారని వారికి వివరించి చెబుతూ,ఈ కింది డిమాండ్లతో కూడినటువంటి వినతి పత్రాన్ని అందించారు.మార్కెట్ కు రైతులు తీసుకొచ్చినటువంటి పత్తి పంటను ఎలాంటి ఖర్చులు లేకుండా అమ్ముకునే విధంగా చూడాలన్నారు.కౌలు రైతులను తక్షణమే గుర్తింపు కార్డులు ఇచ్చి నేరుగా వీరు పండించిన పత్తి పంటను అమ్ముకునే విధంగా చూడాలని,కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు పత్తి రైతులు పంట అమ్మిన వెంటనే 24 గంటల్లో రైతు ఖాతాలో రూపాయలు జమ చేయాలన్నారు.మార్కెట్ ఆవరణ లోకి రైతులు తీసుకువచ్చిన పంటను మాత్రమే కొనుగోలు చేయాలి,ఎకరాకు 12 కింటన్ల చొప్పున( సిసిఐ) కొనుగోలు చేయాలని,ఇట్టి డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ను కోరారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, అఖిలభారత కిసాన్ సంఘటన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుధామల భాస్కర్,తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాలి: సర్పంచి శ్రీనివాస్ గౌడ్




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 30:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా సంక్షేమ ఫలాలు చేరాలని పల్లివాడ గ్రామ సర్పంచి కంభంపాటి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.గ్రామ పనుల గుర్తింపు కొరకు ఏర్పాటు చేసిన గ్రామ సభ పల్లివాడ పంచాయతీలో సర్పంచి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉపాధి కల్పించే పథకాన్ని గ్రామంలో పక్కా ప్రణాళికతో అమలు చేయాలన్నారు. కూలీల ప్రణాళికకు అనుగుణంగా పనులు గుర్తించాలని, ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ప్రతి పంటకు ఒక కుంట తవ్వాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, అధికారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామంలో కొత్తగా చేపట్టిన బోరుబావి పునరుద్ధరణ పనులను అధికారులు, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకులతో కలిసి పరిశీలించారు.

# వీరస్వామి మృతదేహానికి నివాళులు

**• పూలమాల వేసి నివాళులు అర్పించిన మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి తదితరులు**



**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 30:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పాసునుటీ వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ చౌహాన్, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, పత్తిపాక సర్పంచ్ లావుడ్యా సామ్య నాయక్ తదితరులు వీరస్వామి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన - ఎమ్మార్వో



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 30:** నీర్నేముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై రామన్నపేట తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కందిమల్ల గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ వార్డ్ మెంబర్ పెరుమండ్ల నవీన్ ఆర్ఐ శోభ, జీపీవో లక్ష్మి, సెక్రటరీ లక్ష్మి ఏపీవో వెంకన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధు మృతదేహానికి నివాళులు

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్**

**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 30:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీన్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గై శోభన్ పెదనాన్న కుమారుడు గై మధు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్ మధు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కారింగుల సురేష్ గౌడ్, అమీన్‌పేట ఉపసర్పంచ్, పార్టీ అధ్యక్షులు చెల్పూరి దయాకర్, మాజీ ఎంపీటీసీ దశ్రు, గై శోభన్, ఐలయ్య, పొలిశెట్టి చరణ్, ఆకులపల్లి నరేష్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.



# సామూహిక శ్రీమంతాలు రామడుగులో పోషణ మాసం...



**తొలి అక్షరం/రామడుగు, 30 సెప్టెంబర్:** రామడుగు మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ లో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు బాలింతలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిడిపిఓ నరసింహారాణి తెలియజేశారు. రామడుగు సర్పంచ్ మొయిజ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల వరకు పిల్లలను పంపించాలని తల్లులను కోరారు. అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం ద్వారా గర్భిణీ స్త్రీలు బాలింతలు ఆరోగ్యం పరిపుష్టిగా ఉంటుందని అన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ టీచర్లు కార్యదర్శి డి.శ్రీనివాస్ అంగన్వాడి టీచర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట గడ్డపై దళిత బహుజనుల గుండెల్లో నిలిచిన మాస్ లీడర్ నోముల మారయ్య

**- రామన్నపేట నియోజకవర్గంలో దళితుల అగ్రగణ్యుడు, నీర్నేముల మాస్ లీడర్ నోముల మారయ్య తొలి వర్ధంతి**




**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 30:** నాయకుడు అంటే కుర్చీలో కూర్చున్నవాడు కాదు.. జనం గుండెల్లో కూర్చున్నవాడని, అలాంటి నాయకుడే నీర్నేముల గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ నోముల మారయ్య అని పలువురు కొనియాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రామన్నపేట ప్రాంతంలో దళితులు, పేదలు, బడుగు బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా నిలిచిన నోముల మారయ్య తొలి వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. **14 ఏళ్ల సర్పంచ్ పాలన** నీర్నేముల గ్రామ పంచాయతీ కార్యాలయం గోడపై నోముల మారయ్య పేరు రెండుసార్లు చెక్కి ఉంది. 12-06-1981 నుంచి 30-03-1988 వరకు, 31-03-1988 నుంచి 20-10-1995 వరకు మొత్తం 14 సంవత్సరాల 4 నెలల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. ప్రజలతో మమేకమై ప్రత్యర్థులే లేని నాయకుడిగా ఎదిగి గ్రామ ప్రజలపై చెరగని ముద్ర వేశారు. రామన్నపేట ప్రాంతంలో అగ్రవర్ణాల ఆధిపత్యం ఉన్న సమయంలోనే దళితవాడల్లోకి స్వయంగా వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ అండగా నిలిచారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. సర్పంచ్‌గా మాత్రమే కాకుండా సహకార సంఘాల చైర్మన్‌గా కూడా రైతులకు అండగా నిలిచారని తెలిపారు. తన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ 20062011లో తన కుటుంబం నుంచి నోముల పద్మను జెడ్పీటీసీగా గెలిపించారు. అప్పటి రామన్నపేట చివరి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తం రెడ్డితో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. అధికారం ఉన్న సమయంలో అహంకారానికి తావివ్వకుండా అందరినీ ఆదరించే తత్వం నోముల మారయ్యదని పలువురు పేర్కొన్నారు. ఆయన మరణించి ఏడాది గడిచినా విగ్రహావిష్కరణకు గ్రామం మొత్తం తరలిరావడం, కులాలు, పార్టీలకు అతీతంగా నివాళులు అర్పించడం ఆయనకు ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు.

# సూరిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ

**• సూరిపల్లి పీఏసీఎస్ చైర్మన్ మాదాటి శ్రీనివాస్ గౌడ్**




**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 30:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని సూరిపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సూరిపల్లి సర్పంచ్ గడ్డం రజిత, తోపన్‌గడ్డ సర్పంచ్ బానోతు శారద, సంఘ డైరెక్టర్లు, రైతులు, నాయకులు, సంఘ కార్యదర్శి కే. వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. సంఘ డైరెక్టర్లు కోటగిరి సాంబయ్య, గుజ్జునూరి లచ్చమ్మ, సల్వది ఎల్లస్వామి, పోగుల ఉపేంద్ర, పిట్టల కొమ్మలు, కొలిపాక వెంకన్న, మల్లం వేణు, చీకటి రాజు, గుగులోతు రవీందర్, బానోతు వీరేందర్ తదితరులు పాల్గొని మహాజనసభ సమావేశాన్ని విజయవంతం చేశారు.

# ఆపదలో నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండ



**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 30:** ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్య తిరుమల్ చౌహాన్, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ సహకారంతో పెద్దకోర్పోల్ గ్రామానికి చెందిన బొడ్డుపెల్లి నాగమ్మకు రూ.23 వేల విలువైన సీఎం సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు కష్టకాలంలో సీఎం సహాయ నిధి ఆర్థికంగా భరోసా కల్పిస్తోందన్నారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందలేని వారికి ఈ నిధి కొండంత అండగా నిలుస్తోందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన వేగంగా జరుగుతూ, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో చెక్కులు త్వరగా మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దకోర్పోల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెండె రవీందర్, పడాల రాజుకుమార్, బూత్ కమిటీ సభ్యులు చెరుకు యాకాంత్, పడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**




**తొలి అక్షరం/ఖమ్మం, సెప్టెంబర్ 30:** వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు, జాబితా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లను గుర్తించగా, 1,69,802 మందికి నోటీసులు అందజేసినట్లు, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 5,460 ఫారం-6, 1,172 ఫారం-7, 9,087 ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18ను పట్టభద్రత ధ్రువీకరణ పత్రంతో సంబంధిత ఈఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో సమర్పించి ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో సుమారు 84 వేల మంది నమోదు కాగా, ఈసారి కనీసం 2 లక్షల మంది పట్టభద్రులను నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ప్రతి డిగ్రీ, వృత్తి విద్య, పీజీ కళాశాలలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించాలని, 25 నుంచి 60 ఏళ్ల వయస్సు గల ఓటర్లలో పట్టభద్రులను గుర్తించి నమోదు చేయాలని సూచించారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని, బూత్ స్థాయి ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ 7 చివరి తేదీ కాగా, తుది ఎస్ఐఆర్ జాబితా నవంబర్ 9న ప్రచురిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటరు జాబితా కోసం ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితా నవంబర్ 25న, తుది ఓటరు జాబితా డిసెంబర్ 30న ప్రచురించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చెప్పాలి: వ్యవసాయ అధికారి భూక్య మహేందర్





**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 30:** నెల్లికుదురు మండలం లోని వావిలాల రెవెన్యూ గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్న ప్రకృతి వ్యవసాయం పై మండల వ్యవసాయ అధికారి భూక్యా మహేందర్ పాల్గొని రసాయన ఎరువులు మరియు పురుగు మందులు వాడకం వలన కలిగే నష్టాలు గురించి వివరించి ఇక్కడ ఎంపిక చేసిన 125 రైతులు మనిషికి ఒక ఎకరా చొప్పున ప్రకృతి వనరులు ను ఉపయోగించి కాషాయాల తయారీ గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి హితమైన వ్యవసాయం వైపు మారాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బోటుమీది తండా గ్రామ సర్పంచ్ జాతోతు రాంసింగ్ , ఏఇవో మణికంత, ప్రాజెక్ట్ ఇంచార్జి సుస్మిత సిఆర్పి లు రమేష్, సునీత, మరియు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

# ధర్మానికి రక్షకులు..బాధితులకు ఆపద్బాంధవులు

**- పదవి వేరు..నాయకత్వం వేరు**

**- ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ సీ.వీ.ఆనంద్ దిశానిర్దేశం**

**- అకాడమీ వేదికగా యువ అధికారులతో గంటన్నరపాటు భావోద్వేగ ముఖాముఖి**

**- ఫిట్‌నెస్ సాధిస్తేనే ఒత్తిడికి చెక్**






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), సెప్టెంబర్30:** పురాణ కాలంలో గురుకులాల్లో ధనుర్విద్య, రాజనీతి నేర్పించే గురువులు యోధులకు సమగ్ర శిక్షణ ఇచ్చి రణరంగంలో నిలబెట్టినట్లే.. ఆధునిక కాలంలో ప్రజా రక్షణ బాధ్యతను మోసే పోలీస్ అధికారులకు అకాడమీ ఇచ్చే శిక్షణే శ్రీరామ రక్ష అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీ.వి. ఆనంద్ ఉద్ఘాటించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎంతటి సవాళ్లు ఎదురైనా తలొగ్గకుండా నిలబడే గుండెధైర్యం, ఉత్కృష్టమైన నైతిక విలువలనే అసలైన ఆయుధాలుగా మలచుకోవాలని యువ అధికారులకు ఆవాహన చేశారు. రాజేంద్రనగర్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ)లో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో బుధవారం ఆయన గంటన్నర పాటు అత్యంత ఆత్మీయంగా ముఖాముఖి నిర్వహించారు. 30 ఏళ్లకు పైబడిన తన సుదీర్ఘ సర్వీస్ అనుభవ పాఠాలను పంచుకుంటూ..క్షేత్రస్థాయి విధుల్లో పాటించాల్సిన విధానాలు, మానవీయ కోణంపై దిశానిర్దేశం చేశారు. **అధికారం వేరు.. నాయకత్వం వేరు:** కేవలం హోదా,అధికారం ఉన్నంత మాత్రాన ఎవరూ నాయకులు కాలేరని డీజీపీ స్పష్టం చేశారు. సమాజంలో సీనియర్లలో తోటి సిబ్బందిలో గుర్తింపు పొందే నిజమైన లీడర్ కావడానికి ప్రత్యేక గుణాలు అవసరమని వివరించారు. ధైర్యం,స్పష్టమైన దార్శనికత,సమగ్రత, నిష్పక్షపాత వైఖరి, బృంద స్ఫూర్తి, నిరంతరం శ్రమించే తత్వంతో పాటు వినయం ఉన్నప్పుడే ప్రజాదరణ పొందిన అధికారిగా నిలబడతారు అని డీజీపీ సీ.వీ. ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా నైతికత విషయంలో అధికారులు ఎలాంటి సమన్వయం చేసుకోకూడదని హెచ్చరించారు. సుదీర్ఘమైన పోలీస్ సర్వీస్‌లో ప్రారంభంలో చేసే చిన్నచిన్న పొరపాట్లు లేదా అవినీతి మార్గం జీవితాంతం ఒక మచ్చలా మిగిలిపోతాయని, స్వచ్ఛమైన ప్రతిష్ఠను కాపాడుకోవడమే ప్రతి అధికారి ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. పుస్తక చట్టాలతో పాటు మానవీయ స్పందన చట్టాలు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు బాధితుల పట్ల మానవీయ దృక్పథంతో స్పందించినప్పుడే ఆ చట్టానికి అర్థం వస్తుందన్నారు. ప్రజలకు పూర్తి స్థాయి భద్రతా భావాన్ని కల్పించడం, అన్యాయానికి గురైన వారికి సకాలంలో న్యాయం అందేలా చేయడమే పోలీస్ వ్యవస్థ అంతిమ ధ్యేయమని చెప్పారు. అనంతరం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ..ప్రొబేషనరీ డీఎస్పీల బ్యాచ్‌లో 74 మంది పురుషులు,38 మంది మహిళలు కలిపి మొత్తం 112 మంది శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు. సెప్టెంబరు 28 నుంచి హోరాహోరీగా సాగిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 (క్లస్టర్-సి) ముగింపు సభలో డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు. బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ...ఒత్తిడితో కూడిన పోలీస్ ఉద్యోగంలో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని.. ప్రతి పోలీస్ అధికారి రోజూ కనీసం ఒక గంట సమయాన్ని క్రీడలు లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ గజరావు భూపాల్,డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణ పొందుతున్న డీఎస్పీలు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే 143 నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా మద్ది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా మల్యాల నర్సయ్య**




**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 30:** నెల్లికుదురు మండలంలో టీయూడబ్ల్యూజే 143 జిల్లా కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో-కన్వీనర్ గాదెపల్లి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జంపాల చక్రిధర్ సమక్షంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మద్ది వెంకటేశ్వర్లు (మన తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా బైరు శ్రీనివాస్ (సాక్షి), ఉపాధ్యక్షుడిగా మల్యాల నరసయ్య (ఆంధ్రజ్యోతి), సహాయ కార్యదర్శిగా మస్కపురి సుధాకర్ (నమస్తే తెలంగాణ), కోశాధికారిగా చెల్లె ఉపేందర్ (వార్త), కమిటీ సభ్యులుగా పోరెండ్ల లక్ష్మణ్ (ప్రజాజ్యోతి), జీలుకరా శ్రీధర్ (బహుజన టీవీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల్లికుదురు మండలంలోని జర్నలిస్టుల అభ్యున్నతి కోసం పాటుపడతానని తెలిపారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

## రామన్నపేట మండలంలో 4 గ్రామాల కాంగ్రెస్ నూతన గ్రామ శాఖ కమిటీలు ఏర్పాటు







**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 30:** నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాల మేరకు, మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ అధ్యక్షతన మండలంలోని 4 గ్రామాలకు నూతన గ్రామ శాఖ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులుబాచుప్పల గ్రామ శాఖ అధ్యక్షుడిగా – సందన బోయిన మైసయ్యసూరారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా – పోలబోయిన నరసింహకుంకుడు పాముల గ్రామ శాఖ అధ్యక్షుడిగా – నాతి పరుషరాములుతుర్కపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా – జూలకంటి వెంకటేశ్వర్లునూతన అధ్యక్షుల ఎన్నికతో గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. నూతన కమిటీ సభ్యులకు మండల నాయకత్వం శుభాకాంక్షలు తెలిపింది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, బత్తుల కృష్ణగౌడ్, రచ్చ లక్ష్మణ్, ఎండీ అక్రమ్, శంభాల వెంకన్న, సర్పంచులు మాధవి భూపాల్ (బాచుప్పల), బమిటిక శ్రీనివాస్ (సూరారం), వరలక్ష్మి పిచ్చిరెడ్డి (తుర్కపల్లి), మాజీ అధ్యక్షులు లింగస్వామి, శ్రీనివాస్ రెడ్డి, జాన్ రెడ్డి, సైదులు, బొక్క పురుషోత్తం రెడ్డి, దిండిగల సత్తయ్యతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్ 30:** జిల్లేడు చౌదరిగూడ మండలం పెద్ద ఎలికిచెర్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అండగా నిలిచారు. చిన్నగళ్ళ మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా అవు మృతి చెందడంతో నష్టపోయిన బీఆర్ఎస్ కార్యకర్త దొరమోని శ్రీను కుటుంబాన్ని కూడా అంజయ్య యాదవ్ పరామర్శించారు. వారి పరిస్థితిని తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కష్టసమయంలో కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు భరోసాగా నిలవడమే తన బాధ్యత అని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## చిన్నారి 21వ రోజు వేడుకల్లో ఆత్మీయుల సందడి

- శ్రీధర్ పంతులునీరజ దంపతుల కుమార్తె హర్షిని, సంతోష్ కుమార్ దంపతుల కుమారుడికి ఘనంగా వేడుకలు
- ఉప్పల్‌లోని ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో సంబరాలు





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ సెప్టెంబర్ 30:** ఉప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రీధర్ పంతులునీరజ దంపతుల కుమార్తె హర్షిని, సంతోష్ కుమార్ దంపతుల కుమారుడి 21వ రోజు వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారిని బంధువులు, ఆత్మీయులు ఆప్యాయంగా ఆశీర్వదించి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.చిన్నారి 21వ రోజు వేడుకలు కావడంతో ఫంక్షన్ హాల్‌లో సందడి వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి చిన్నారికి తమ ఆశీస్సులు అందిస్తూ వేడుకల్లో ఆనందంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) హైదర్‌నగర్ కార్పొరేటర్ కంటెంట్ ఇక్రాన్ ఖాన్, రవి, స్వామి తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఆత్మీయుల ఆశీస్సులు, బంధుమిత్రుల సందడి మధ్య ఉప్పల్‌లో జరిగిన చిన్నారి 21వ రోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

# విద్యతోనే సమసమాజ స్థాపన సాధ్యం

**- విద్యాశాఖ అధికారుల చొరవ, దాతల ఉదారత అభినందనీయం: ఎమ్మెల్యే**





**తొలి అక్షరం/షాద్‌నగర్, సెప్టెంబర్ 30:** మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలను అధిగమించి విద్య ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. హాజీపల్లి శివారులోని సిండికేట్ కాలనీలో పేద విద్యార్థుల కోసం నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఎంఈఓ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక విలేకరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి కొనసాగుతున్న అసమానతల కారణంగా పలు కులాలు, పేద వర్గాలు విద్యకు దూరమయ్యాయని, స్వాతంత్ర్యం అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించారని గుర్తుచేశారు. చదువు ద్వారానే ఆర్థిక, సామాజిక పురోగతితో పాటు గౌరవప్రదమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. సిండికేట్ కాలనీలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లలను చదివించలేని కుటుంబాలను గుర్తించి, వారిని తిరిగి బడిబాట పట్టించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక సర్వే చేపట్టడం అభినందనీయమన్నారు.**దాతల ఉదారత.. ప్రజాప్రతినిధుల సహకారం**పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది దాతలు రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, భోజన వసతులతో పాటు పాఠశాల మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. పిల్లల చదువుతో పాటు వారి తల్లిదండ్రులు స్వయంశక్తితో జీవించేందుకు వృత్తిపర మైన సహాయసహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకు వచ్చిన విలేకరులు, విద్యాశాఖ అధికారులు, సర్పంచ్, నాయకులు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్‌లో మెగా రక్తదాన శిబిరం

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లయన్స్ క్లబ్ వరంగల్ సహకారంతో నిర్వహణ**





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్ వరంగల్)లోని విద్యార్థి కార్యకలాపాల కేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హన్మకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లయన్స్ క్లబ్ వరంగల్ సహకారంతో ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిట్స్ వరంగల్ విద్యార్థులు, సిబ్బంది మొత్తం 466 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారు.ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ కోశాధికారి, లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యుడు పి. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అవసరంలో ఉన్నవారికి రక్తదానం చేయడం అత్యంత గొప్ప సేవా కార్యక్రమమని అన్నారు. ఒక్క చుక్క రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. కిట్స్ వరంగల్ విద్యార్థులు రక్తదానం ద్వారా తమ సామాజిక బాధ్యతను నిరూపించుకున్నారని తెలిపారు.కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం సమాజం పట్ల బాధ్యతను పెంపొందిస్తుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత రక్తం అందుబాటులో ఉండేందుకు స్వచ్ఛంద రక్తదానం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు రక్తదానంతో పాటు స్వచ్ఛ భారత్, చెట్ల పెంపకం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రక్తదాన శిబిరానికి ఆర్థిక సహకారం అందించిన హన్మకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, సిబ్బందికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వరంగల్ అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె. విష్ణుకుమార్ గుప్తా, కోశాధికారి పాడిరే కీర్తితేజరెడ్డి, ఐఆర్‌సీఎస్ హన్మకొండ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్. సతీష్ చంద్ర, డీన్ విద్యార్థి వ్యవహారాలు ప్రొఫెసర్ కె. శ్రీధర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు, వివిధ విభాగాల సిబ్బంది, 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల కోసం ఎదురుచూడొద్దు... ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలి!

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొర్రూరులో**

**ఘనంగా ఈ డి సి ఒకరోజు వర్క్‌షాప్**

**విద్యార్థులకు మార్గదర్శనం చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ మచ్చ సురేష్**

**హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు, అధ్యాపక బృందం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) సెప్టెంబర్ 30:** నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ విజయవంతమైన వ్యవస్థాపకులుగా ఎదగాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ మచ్చ సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఈ డిసి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా హాజరై ప్రసంగించారు. వ్యాపార రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను గుర్తించి, నూతన ఆలోచనలు, సృజనాత్మకత మరియు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. స్వయం ఉపాధితో పాటు మరెంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని కోరారు.**ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి: ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు** కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు మాట్లాడుతూ, పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి విద్యార్థులు కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యవస్థాపకులుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ డి సి ద్వారా వ్యాపార ఆలోచనలు, నైపుణ్యాభివృద్ధి మరియు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. **నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం: డాక్టర్ జి. సుజాత** కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ జి. సుజాత మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, స్వయం ప్రతిపత్తిని నింపేందుకు ప్రతి ఏటా ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించడమే ఈ డి సి ప్రధాన ధ్యేయమని వివరించారు. **ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు** ఈ వర్క్‌షాప్‌లో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాధిక, డాక్టర్ రజిత, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్లయ్య, శ్రీమతి వెన్నెల, శ్రీ నగేష్ బాబు, శ్రీ రాజేష్, శ్రీ సోమేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యవస్థాపకతకు సంబంధించిన పలు విలువైన అంశాలను వారు తెలుసుకున్నారు. “ఉద్యోగాన్ని వెతుక్కోవడం కాదు... ఉద్యోగాన్ని ఇచ్చే స్థాయికి ఎదగడమే నేటి యువత లక్ష్యం“ అనే ఆదర్శవంతమైన సందేశంతో ఈ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది.



## క్రికెట్‌కు ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ వీడ్కోలు..!



ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ నుంచి వలస వెళ్లి ఐరిష్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిమి.. 39 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం తీవ్ర అనారగ్యంతో బాధపడిన అతడు.. ఈమధ్యే పూర్తిగా కోలుకున్నాడు. కానీ, కుర్రాళ్ల నుంచి పోటీ ఎక్కువవ్వడం, వయసు పైబడడంతో పునరాగమనం అసాధ్యమని తెలిసి మంగళవారం హఠాత్తుగా ఆటకు అల్విదా చెప్పేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఐర్లాండ్ ఆటగాడు సిమి సింగ్ రిటైరయ్యాడు. భారత్ నుంచి 19 ఏళ్ల వయసులో ఆ దేశం వెళ్లిన సిమి.. క్రికెటర్‌గా రాణించాడు. 2017లో అరంగేట్రం చేసిన సిమి.. వీడ్కోలు మ్యాచ్ లేకుండానే తొమ్మిదేళ్ల కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ ఆడిన ఆ ఆల్‌రౌండర్ 2021లో ఐసీసీ పురుషుల వన్డే జట్టులో చోటు సంపాదించాడు. 29 ఏళ్లకు డెబ్యూ క్యాప్ అందుకొని న్యూజిలాండ్‌పై తొలి మ్యాచ్ ఆడిన సిమి.. ఐర్లాండ్ తరఫున 88 మ్యాచ్(35 వన్డేలు, 53 టీ20లు)లు ఆడాడు. బంతితో రాణించి 83 వికెట్లు తీసిన అతడు 2021లో దక్షిణాఫ్రికా అజేయ శతకం సాధించాడు. ఆ మ్యాచ్‌లో సఫారీలపై ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వన్డే సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా సిమి చరిత్ర సృష్టించాడు. క్రికెట్ కెరీర్ కొనసాగుతున్న సమయంలోనే సిమి సింగ్ అనారోగ్యానికి గురయ్యాడు. 2024లో అతడు కాలేయ మార్పిడి చేయించుకున్నాడు. ఇటీవలే పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం అతడికి 39 ఏళ్లు. దాంతో.. ఇక పునరాగమనం కష్టమే అనుకున్న సిమి వీడ్కోలు ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్ ఆడాలనే కోరికతో నేను 19 ఏళ్ల పిల్లాడిగా ఐర్లాండ్‌కు వచ్చా. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుటే నా ప్రయాణం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. నాకు మద్దతిచ్చినందుకు, నాపై నమ్మకం ఉంచినందుకు ఐర్లాండ్ క్రికెట్‌కు ధన్యవాదాలు. నా కుటుంబం ప్రేమ, మద్దతు లేకపోయి ఉంటే ఇదంతా సాధ్యమయ్యేది కాదు అని సిమి పేర్కొన్నాడు.

## ఫైనల్లోకి భారత మహిళల హాకీ జట్టు



ఆసియా క్రీడల్లో జయభేరి మోగిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశ నుంచి దుమ్మురేపిన టీమిండియా సెమీఫైనల్లో దక్షిణ కొరియాను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ పసిడి పోరుకు సిద్ధమైంది భారత్. కీలకమైన ఈ మ్యాచ్‌లో ఇషికా ఔదరీ, కెప్టెన్ సలీమా టెటె చెరో గోల్‌తో రాణించారు. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచింది. తొలి రౌండ్ నుంచి అదరగొట్టిన టీమిండియా బుధవారం సెమీఫైనల్లో దక్షిణా కొరియాను నిలువరించింది. పటిష్టమైన కొరియాపై 2–0తో గెలుపొందిన భారత్.. 44 ఏళ్ల స్వప్నాన్ని సాకారం చేస్తూ ఫైనల్లో అడుగుపెట్టింది. చివరగా 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన క్రీడల్లో పసిడి పతకం సాధించింది మహిళల జట్టు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు సలీమా టెటె సారథ్యంలోని భారత బృందం సంచలన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపించింది. బుధవారం దక్షిణ కొరియాపై ఇషికా చౌదరీ 44వ నిమిషంలో.. కెప్టెన్ సలీమ 48వ నిమిషంలో గోల్ చేయగా.. ఉమెన్ ఇన్ సాఫ్రాన్ దర్జాగా ఫైనల్ చేరింది. స్వర్ణం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను టీమిండయా ఢీకొట్టనుంది.

## కుల్దీప్ యాదవ్ 'డబుల్ సెంచరీ'



టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న తొలి భారత స్పిన్నర్‌గా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో షై హోప్, కీమో పాల్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. 123 వన్డేల్లో 26.70 సగటుతో కుల్దీప్ యాదవ్ 200 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత ఉండగా.. 10 సార్లు నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. కుల్దీప్ యాదవ్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 6/25గా ఉన్నాయి. మహమ్మద్ షమీ 104 వన్డేల్లో 200 వికెట్ల మైలురాయి అందుకొని అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి తొలి భారత బౌలర్‌గా కొనసాగుతున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో ఉండగా.. అజిత్ అగార్కర్ 133 వన్డేల్లో, జహీర్ ఖాన్ 144 వన్డేల్లో 200 వికెట్ల మార్క్‌ను చేరుకున్నారు. భారత క్రికెట్‌లో ఇప్పటి వరకు 9 మంది బౌలర్లు 200 వికెట్ల మైలురాయి అందుకోగా.. అనిల్ కుంబ్లే 334 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. జవగళ్ శ్రీనాథ్ (315 వికెట్లు), అజిత్ అగార్కర్(288 వికెట్లు), జహీర్ ఖాన్(269 వికెట్లు, హర్భజన్ సింగ్(265 వికెట్లు), కపిల్ దేవ్(253 వికెట్లు), జడేజా(232 వికెట్లు), షమీ(206 వికెట్లు) కుల్దీప్ యాదవ్ కంటే ముందున్నారు.

## టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా?



టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరగనున్న ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీంతో పాటు, అక్టోబర్ 24 నుంచి న్యూజిలాండ్‌లో మూడు టెస్టులు ఆడనున్న భారత్ 'ఎ' జట్టును కూడా ఎంపిక చేయాల్సి ఉంది. భారత జట్టు వరుస సిరీస్‌లతో తీరిక లేకుండా ఉండటంతో ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కొత్త సెలెక్షన్ కమిటీకి పెద్ద సవాలుగా మారనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు కూడా ఈ పర్యటన కీలకం కానుంది. సీనియర్ జట్టు అవసరాలతో పాటు, భారత్ 'ఎ' కార్యక్రమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఓజా నేతృత్వంలోని కమిటీ ముందున్న ప్రధాన కర్తవ్యం.

## సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు



- మల్కాజ్‌గిరి కమిషనరేట్‌లో ముగ్గురు అధికారుల విరమణ

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు), సెప్టెంబర్30:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో ఎన్నో సంవత్సరాలుగా సేవలందించిన ముగ్గురు పోలీస్ అధికారులు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్ అవుతున్న అధికారులు తమ సుదీర్ఘ పోలీస్ సేవలో ఎదురైన అనుభవాలను, విధి నిర్వహణలో ఎదురైన సవాళ్లను, వాటిని అధిగమించిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. తమ సేవా ప్రయాణంలో ఎదురైన అనుభవాలను తోటి అధికారులు, సిబ్బందితో పంచుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి.సుమతి మాట్లాడుతూ...పోలీస్ విధుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పరిస్థితుల నుంచి నేర్చుకుంటూ, అనుభవాన్ని భవిష్యత్ సేవలకు ఉపయోగించుకోవాలని విలువైన సూచనలు చేశారు. రిటైర్మెంట్ పొందుతున్న అధికారులు పోలీస్ శాఖకు అందించిన సేవలను అభినందిస్తూ, వారి విధి నిర్వహణను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో సీహెచ్.రామేశ్వర్, ఏడీసీపీ, క్రైమ్,ఏ.కృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐ, సిఏఆర్అంబర్పేట్,పి.ప్రభాకర్ రెడ్డి, ఎస్సై నాచారం పోలీస్ స్టేషన్ ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిపి బి.సుమతి, డీసీపీ అడ్మిన్ ఇందిరా, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని రిటైర్ అవుతున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజ్‌గిరి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరఫున ప్రెసిడెంట్ డి.శ్రీనివాస్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్లు వెంకటేశ్వర్లు, రంగస్వామి, జాయింట్ సెక్రటరీ ఎస్. వలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష్, ఈసి మెంబర్లు గోపి, రాజేష్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఆర్ ప్రెసిడెంట్ సతీష్,ఏఆర్ ట్రెజరర్ విజయ్ బాబు, ఏఆర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్ లాల్, కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరఫున డైరెక్టర్లు సువర్ణ, రవీందర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని రిటైర్ అవుతున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర



వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర సృష్టించింది. 53 ఏళ్ల తమ వన్డే క్రికెట్ చరిత్రలో తొలిసారి 400o స్కోర్ చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ 405/7 స్కోర్ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. వన్డే క్రికెట్ చరిత్రలోనే వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక స్కోర్ కావడం గమనార్హం. జాన్ క్యాంబెల్(68 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101), కెప్టెన్ షై హోప్(94 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 104), అమీర్ జంగూ(77 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 114) శతకాలతో చెలరేగడంతో విండీస్ ఈ భారీ స్కోర్ నమోదు చేసింది. అంతేకాకుండా వెస్టిండీస్ వన్డే క్రికెట్ చరిత్రలోనే ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు శతకాలు సాధించడం కూడా ఇదే తొలిసారి. 2019లో ఇంగ్లండ్‌పై సెయింట్ జార్జ్ వేదికగా చేసిన 389 పరుగులే వెస్టిండీస్‌కు హయ్యెస్ట్ స్కోర్‌గా ఉండగా.. గౌహతి మ్యాచ్‌లో ఈ రికార్డ్‌ను అధిగమించింది. వెస్టిండీస్ బ్యాటర్ల విధ్వంసంతో భారత బౌలర్లు తేలిపోయారు. అరంగేట్ర పేసర్ అకీబ్ నబీ 8.5 ఓవర్లలో 84 పరుగులిచ్చి ఒక్క వికెట్ తీయలేకపోయాడు. గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 2 వికెట్లు తీసినప్పటికీ 96 పరుగులు సమర్పించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ 5 ఓవర్లలోనే 45 పరుగులిచ్చుకోగా.. జడేజా, కుల్దీప్ యాదవ్ పూర్తి కోటా బౌలింగ్ చేసి 75, 65 పరుగులు ఇచ్చుకున్నారు. వన్డేల్లో వెస్టిండీస్ అత్యధిక స్కోర్లు..405/7లి జం భారత్, గౌహతి 2026389 జం ఇంగ్లండ్, సెయింట్ జార్జ్ 2019385/7 జం ఐర్లాండ్, డబ్లీన్ 2025381/3 జం ఐర్లాండ్, డబ్లీన్ 2019374/6 జం నెదర్లాండ్, హరారే 2023 భారత్‌పై అత్యధిక వన్డే స్కోర్లు438/4 సౌతాఫ్రికా, వాంఖడే 2015411/8 శ్రీలంక, రాజ్‌కోట్ 2009405/7 వెస్టిండీస్, గౌహతి 2026లి389/4 ఆస్ట్రేలియా, సిడ్నీ 2020387/3 ఇంగ్లండ్, లార్డ్స్ 2026

### సత్య, యోగి బాబుల సినిమాకు టైటిల్ ఖరారు..

# 'గోల్డెన్ భాగ్యం'!




తెలుగు చిత్రసీమకు చెందిన ప్రముఖ హాస్య నటుడు సత్య, తమిళ స్టార్ కమెడియన్ యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రానికి టైటిల్ ఖరారైంది. ఈ సినిమాకు 'గోల్డెన్ భాగ్యం' అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పవన్ బసమ్మెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ రివీల్ గ్లింప్స్ వీడియో ఆకట్టుకుంటోంది. బిర్యానీ, ఇడ్లీలలో ఏది గొప్పదనే అంశంపై తెలుగు, తమిళ వ్యక్తుల మధ్య జరిగే సరదా సంభాషణతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో ఉన్న సత్య, యోగి బాబులను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో సత్య తమిళంలో, యోగి బాబు తెలుగులో సంభాషించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇది ప్రేమ, నేరం (క్రైమ్), యాక్షన్ కలగలిసిన పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని మేకర్స్ వెల్లడించారు.డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాల పతాకాలపై నాగార్జున రెడ్డి, పవన్ బసమ్మెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయశ్రీ, అతిరాజ్ కథానాయికలుగా నటిస్తుండగా.. వెన్నెల కిశోర్, సుదర్శన్, కిశోర్ తిరుమల, రోహిణి, తనికెళ్ల భరణి, సునీల్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబ్లు అజు ఛాయాగ్రహణం అందిస్తుండగా, పవన్ సీహెచ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

### ముంబై 26/11 దాడుల హీరో కథ..

# ఉత్కంఠ రేపుతున్న 'ప్రహార్' ట్రైలర్

బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్'. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.దేశం గర్వించదగ్గ పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో ఒకరైన ఉజ్వల్ నికమ్ జీవిత కథ ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. ముఖ్యంగా 26/11 ముంబై దాడి కేసులో ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన వాదనలు, కోర్టు రూమ్‌లో జరిగిన నాటకీయ పరిణామాలు, ఆయన వ్యక్తిగత జీవితంలోని కొన్ని అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు.ఉజ్వల్ నికమ్ పాత్రలో రాజ్ కుమార్ రావు తన అద్భుతమైన నటనతో ఆకట్టుకోనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన వామికా గబ్బి నటిస్తుండగా.. జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అవినాష్ అరుణ్ ధవారే దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 16, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# మొత్తం చిత్ర పరిశ్రమను నిందించకూడదు : అమలా పాల్



సినిమాల్లో కొందరు హీరోయిన్లను అభ్యంతరకరంగా చూపించడానికి మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని, అది ఆయా చిత్రాల దర్శకుడు లేదా టీమ్ ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ నటి అమలా పాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మహిళా ప్రాధాన్య చిత్రాలు ఎక్కువగా వస్తుండటం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు.కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2026'లో అమలా పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల పాత్రల చిత్రీకరణపై వస్తున్న విమర్శలపై స్పందించారు. "ప్రతి పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య చిత్రాలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం పరిశ్రమను నిందించదలుచుకోలేదు. సమస్య ఏదైనా ఉంటే అది ఒక సినిమాకు లేదా దర్శకుడి ఆలోచనా విధానానికే పరిమితమై ఉంటుంది," అని ఆమె వివరించారు.

15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న తాను ఎప్పుడూ మూస పాత్రలకు భిన్నంగా, ప్రత్యేకమైన పాత్రలనే ఎంచుకున్నానని అమలా పాల్ తెలిపారు. ఇందులో భాగంగానే 2019లో 'ఆడై' (తెలుగులో 'ఆమె') లాంటి సాహసోపేతమైన చిత్రంలో నటించానని గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో నా ఇమేజ్ ఏమవుతుందోనని, అలాంటి పాత్రలే మళ్లీ వస్తాయేమోనని భయపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది చాలా ధైర్యమైన నిర్ణయంగా అనిపిస్తోంది. కానీ, ఇప్పుడు నన్ను 'ఆడై' లాంటి సినిమా చేయమంటే బహుశా చేయలేకపోవచ్చు," అని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తమ స్థానం కోసం కష్టపడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అన్న రాఘవేంద్రరావు



ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకులు కె. రాఘవేంద్రరావు చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చిరునవ్వుతో ఇచ్చిన హుందా స్పందన అందరినీ ఆకట్టుకుంటోంది.



ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో, శశాంక్ వెన్నెలకంటి దర్శకత్వంలో వస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ సినిమా అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన వేడుకకు జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని 'జై ఎన్టీఆర్' అనే నినాదంతో ప్రారంభించి అందరిలో ఉత్సాహం నింపారు.వెంటనే స్పందిస్తూ, "జై ఎన్టీఆర్ అంటే ఇక్కడ కూర్చున్న అబ్బాయి కాదు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు" అని స్పష్టం చేశారు. "ఆయన సీనియర్ ఎన్టీఆర్. ఆయన తనయుడు హరికృష్ణ. ఆయన కుమారుడు ఇక్కడున్న మన జూనియర్ ఎన్టీఆర్. ఈయన జెన్‌జీ ఎన్టీఆర్" అని చమత్కరించారు.రాఘవేంద్రరావు వ్యాఖ్యలకు జూనియర్ ఎన్టీఆర్ వేదికపై చిరునవ్వుతో కనిపించగా, పక్కనే ఉన్న రాజమౌళి కూడా నవ్వారు. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించినప్పుడు తారక్ చూపిన గౌరవం, ప్రశాంతమైన స్పందనను అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# పట్టు వదలని నాని..



ప్యారడైజ్‌కు రిలీజ్ రోజు నుంచే మిక్స్డ్ టాక్ వచ్చింది. ఈ విషయాన్ని నాని కూడా దాచిపెట్టలేదు. సినిమా అందరికీ ఒకేలా కనెక్ట్ కాలేదని ఆయన ఓపెన్‌గానే మాట్లాడారు. సాధారణంగా ఇలాంటి టాక్ వచ్చిన తర్వాత హీరోలు ప్రమోషన్స్ తగ్గించి నెక్స్ట్ పనుల్లోకి వెళ్లిపోతారు. కానీ నాని మాత్రం అలా చేయడం లేదు. సినిమా థియేటర్లలో ఉన్నంత వరకు తనవంతుగా ఎంత చేయాలో అంత చేయాలనే మూడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణలో ప్రమోషన్స్ చేసిన తర్వాత ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ వరుసగా తిరుగుతున్నారు. విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకోవడంతో పాటు, ఒంగోలులోని థియేటర్‌కు వెళ్లి ఆడియన్స్‌ను కలవనున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చిన విజువల్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంటే సినిమా మీద టాక్ ఎలా ఉన్నా, పబ్లిక్‌లో 'ది ప్యారడైజ్' పేరు తగ్గకుండా చూసే ప్రయత్నం మాత్రం నాని వైపు నుంచి గట్టిగానే జరుగుతోంది. మొదటి వీకెండ్ వరకు కలెక్షన్స్ కూడా పూర్తిగా పడిపోలేదు. ఓపెనింగ్స్‌కు నాని మార్కెట్, భారీ ప్రమోషన్, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ బాగా ఉపయోగపడ్డాయి. అయితే వీకెండ్ తర్వాతే అసలు లెక్క మొదలవుతుంది. మిక్స్డ్ టాక్ ఉన్న సినిమాలకు సోమవారం నుంచి డ్రాప్స్ ఎలా ఉంటాయన్నదే కీలకం. అందుకే ఇప్పుడు టీమ్ కూడా ప్రమోషన్స్‌ను ఆపకుండా మరోసారి ఆడియన్స్‌ను థియేటర్ల వైపు తిప్పే ప్రయత్నం చేస్తోంది. దీనికి గాంధీ జయంతి కూడా కలిసి వస్తోంది. మధ్యలో హాలిడే ఉండటం, వెంటనే మరో వీకెండ్ రావడం 'ది ప్యారడైజ్'కు రెండో ఛాన్స్‌లా మారొచ్చు. మొదటి వీకెండ్‌లో చూడని ఆడియన్స్‌ను ఈ గ్యాప్‌లో థియేటర్లకు రప్పించగలిగితే కలెక్షన్స్ ఇంకొన్ని రోజులు నిలబడే అవకాశం ఉంటుంది. అందుకే నాని ఈ టైమ్‌లోనే ఆంధ్రా టూర్ పెట్టుకోవడం కూడా ప్లాన్డ్ మూవ్‌లానే కనిపిస్తోంది.

### బడ్జెట్ 30 కోట్ల లోపు .. వసూళ్లు 300 కోట్లకి పైన ..

# ఓటీటీకి మలయాళ మూవీ!

చాలా తక్కువ బడ్జెట్ లో రూపొందడం .. భారీ వసూళ్లను ఖాతాలో వేసుకోవడం మలయాళ సినిమాల విషయంలో జరుగుతూనే ఉంటుంది. క్రితం ఏడాదిలోను .. ఈ ఏడాది ఆరంభంలోను మలయాళంలో చిన్న సినిమాలు వసూళ్ల పరంగా కొత్త రికార్డులను సృష్టించాయి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోను ఈ సినిమాలు భారీ విజయాలను నమోదు చేయడం విశేషం. అలాంటి సినిమాల జాబితాలో తాజాగా 'బెత్లెహెం కుటుంబ యూనిట్' సినిమా కనిపిస్తుంది. నివిన్ పౌలి – మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. టైటిల్ ను మార్చకుండా ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయడం కూడా విశేషంగా చెప్పుకోవచ్చు. అయినా తెలుగు వైపు నుంచి కూడా ఈ సినిమాకి మంచి ఆదరణ లభించింది. దాదాపు 25 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. అలాంటి ఈ సినిమా 325 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ఒక చిన్న టౌన్ నేపథ్యంలో నడిచే సింపుల్ లవ్ స్టోరీ ఈ స్థాయి వసూళ్లు రావడం నిజంగా గొప్ప విషయమే.ఈ సినిమాలో హీరోకి పెళ్లీడు దాటిపోతుంది. అతను ఇక పెళ్లి విషయాన్ని పక్కన పెట్టేసి కేటరింగ్ బిజినెస్ చూసుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలో కొత్తగా ఆ ఊరు వచ్చిన హీరోయిన్ కి ఆయన కేరక్టర్ నచ్చుతుంది. తనకంటే అతను వయసులో చాలా పెద్దవాడైనప్పటికీ లవ్ చేయడం మొదలుపెడుతుంది. ఆ విషయం ఆమె ఇంట్లో తెలుస్తుంది. అప్పుడు ఏం జరుగుతుంది? అనేది కథ. అక్టోబర్ 2వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో అందుబాటులోకి వస్తున్న ఈ సినిమాకి, ఓటీటీ వైపు నుంచి ఏ స్థాయి ఆదరణ లభిస్తుందనేది చూడాలి.

